
సాక్షి పల్నాడు

శుక్రవారం । 6 । అక్టోబర్ । 2023




నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్ : గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌లో గురువారం క్వింటాలు నిమ్మకాయలు కనిష్ట ధర రూ.2,600, గరిష్ట ధర రూ.3600, మోడల్ ధర రూ.3200 వరకు పలికింది.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద గురువారం 3,225 క్యూసెక్కులు విడుదల చేశారు. కొమ్మమూరు కాల్వకు 1,198 క్యూసెక్కులు వదిలారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 525.10 అడుగుల వద్ద ఉంది. ఎస్‌ఎల్‌బీసీకి 900 క్యూసెక్కులు విడుదలవుతోంది.

న్యూస్‌రీల్

కొండవీడు పర్యాటకాభివృద్ధికి కృషి

యడ్లపాడు: సందర్శకులకు మెరుగైన వసతుల కల్పనే లక్ష్యంగా కొండవీడు పర్యాటక కేంద్రంలో సరికొత్త ప్రాజెక్టులను రూపొందించాలని ముఖ్య అటవీ సంరక్షణ అధికారి (గుంటూరు) వై.శ్రీనివాసరెడ్డి ఆ శాఖ అధికారులను ఆదేశించారు. యడ్లపాడు మండలంలోని చారిత్రక ప్రాంతం కొండవీడుకోటను గురువారం ఆయన సందర్శించారు. వచ్చే ఆర్థిక సంవత్సరం నాటికి కొండవీడు–నగరవనం ద్వారా ప్రతినెలా చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై క్షేత్ర స్థాయిలో సమీక్షించి పలు సూచనలు చేశారు. సుమారు రూ.3 కోట్ల అంచనాతో చేయాల్సిన కొండవీడు అభివృద్ధి పనులకు సంబంధించి ప్రణాళికల రూపకల్పనకు మార్గదర్శనం చేశారు. కార్యక్రమంలో అటవీశాఖ రేంజ్ అధికారి రమణమ్మ, డీఆర్వో పి.నీలిమాదేవి, కొండవీడు బీట్‌ఆఫీసర్ ఎస్.పురుషోత్తమరాజు, ఏబీఓ కె.వెంకటేశ్వరరావు, కొండవీడు కోట అభివృద్ధి కన్వీనర్ కల్లి శివారెడ్డి పాల్గొన్నారు.

జీఎస్టీ నంబరు బోర్డు ఏర్పాటు చేయాలి

నరసరావుపేట: రాష్ట్రం అంతటా డెకాయ్ ఆపరేషన్ జరగబోతున్న తరుణంలో ప్రతి వ్యాపార సంస్థ జీఎస్టీ నంబరు కనపడేలా ఏర్పాట్లు చేసి ప్రతి అమ్మకానికి బిల్లు ఇవ్వాలని చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్ష, కార్యదర్శులు కొత్తూరి కిషోర్‌బాబు, గాదంశెట్టి రామకృష్ణ గురువారం సూచించారు. లేనిపక్షంలో రూ.20 వేలు జరిమానా చెల్లించే పరిస్థితి వస్తుందన్నారు. ప్రతి అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు, వారి సభ్యులకు తెలియచేసి అప్రమత్తం చేయాలని కోరారు.

ప్రొవిజనల్ మెరిట్ లిస్టు విడుదల

గుంటూరు మెడికల్ : గుంటూరు జీజీహెచ్‌లో ఎనస్థీషియా టెక్నీషియన్ పోస్టుల భర్తీకి దరఖాస్తు చేసుకున్న వారి ప్రొవిజనల్ మెరిట్ లిస్టును విడుదల చేసినట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు తెలిపారు. ప్రొవిజనల్ మెరిట్ లిస్టుపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 10వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు తెలియజేయాలన్నారు. ప్రొవిజనల్ మెరిట్‌లిస్టును గుంటూరు.ఏపీ.ఇన్/ఎంహెచ్2023 వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామన్నారు.

7న మహిళా కళాశాలలో జాబ్ డ్రైవ్

గుంటూరు ఎడ్యుకేషన్ : సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాల ప్రాంగణంలో జేకేసీ ఆధ్వర్యంలో ఈనెల 7వ తేదీన జాబ్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. డైకిన్ సంస్థలో ప్రొడక్షన్, క్వాలిటీ కంట్రోల్ ఆపరేటర్, లైన్ సూపర్‌వైజర్లుగా 150 పోస్టుల భర్తీ కోసం నిర్వహిస్తున్న జాబ్ డ్రైవ్‌లో డిగ్రీ విద్యార్హతతోపాటు 18 నుంచి 24 ఏళ్ల వయసు గల మహిళా అభ్యర్థులు శనివారం ఉదయం 10 గంటలకు నేరుగా ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు. తమ వెంట బయోడేటా, టెన్త్, ఇంటర్, డిగ్రీ మార్కుల జాబితాలు, ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో రావాలని తెలిపారు.

దసరా ఉత్సవ ఏర్పాట్లపై క్షేత్రస్థాయి పర్యటన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దసరా ఉత్సవాలకు సుదూర ప్రాంతాల నుంచి విచ్చేసే భక్తులకు ఎటువంటి ఇబ్బందులూ కలుగకుండా పక్కా ఏర్పాట్లు చేయాలని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణా చెప్పారు. శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై 15వ తేదీ నుంచి ప్రారంభమయ్యే దసరా ఉత్సవాల ఏర్పాట్లను డీసీపీ విశాల్‌గున్నీ, ఏఐజీ ఎం.రవీంద్రబాబు, దుర్గగుడి ఈఓ భ్రమరాంబ, ఇతర ఇంజినీరింగ్ అధికారులతో కలిసి సీపీ గురువారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. కెనాల్ రోడ్డులోని వినాయకుడి గుడి నుంచి ప్రారంభమయ్యే క్యూలైన్లతో పాటు వీఎంసీ కార్యాలయం ఎదుట దేవస్థానం ఏర్పాటు చేస్తున్న కేశఖండన శాల షెడ్డు, క్యూలైన్లను పరిశీలించారు. అమ్మవారికి తలనీలాలు సమర్పించే భక్తులు వేచి ఉండకుండా త్వరితగతిన ముందుకు సాగేలా క్యూలైన్లు, ఇతర ఏర్పాట్లను చేయాలని సూచించారు. అనంతరం పార్కింగ్ ప్రదేశాన్ని పరిశీలించారు. కనకదుర్గనగర్‌లో ప్రసాదాల కౌంటర్లను పరిశీలించి ఇంజినీరింగ్ సిబ్బందికి సూచనలిచ్చారు. ఉత్సవాలలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈవో భ్రమరాంబ పేర్కొన్నారు. కార్యక్రమంలో దేవస్థాన ఈఈ లింగం రమాదేవి, వెస్ట్ ఏసీపీ హనుమంతరావు, సీఐ సురేష్‌రెడ్డి ఇతర అధికారులు పాల్గొన్నారు.

సేద్యం నవానందం

రైతాంగంలో కొత్త ఆశలు

- వర్షాలతో వడివడిగా సాగు...
- జోరందుకున్న పంటల సాగు
- 55,745 హెక్టార్లకు చేరిన మిర్చి నాట్లు
- సాగర్ జలాల కొరతతో తగ్గిన ఖరీఫ్ సాగు
- ముందస్తు రబీలో భాగంగా ప్రత్యామ్నాయ పంటలవైపు రైతుల మొగ్గు



ఇటీవల కురిసిన వర్షాలతో పచ్చగా ఉన్న మిర్చి పంట

సాక్షి, నరసరావుపేట: పదిహేను రోజులుగా కురుస్తున్న వర్షాలకు జిల్లాలో పంటల సాగు ఊపందుకుంది. సెప్టెంబర్ రెండో వారం వరకు వర్షాభావ పరిస్థితులు, నాగార్జునసాగర్‌లో నీటి నిల్వలు తక్కువగా ఉండటంతో ఈ ఏడాది ఖరీఫ్‌లో సాగు అంతంతమాత్రంగానే సాగింది. కీలకమైన ఆగస్టు నెలలో 68 శాతం తక్కువ వర్షపాతం నమోదు కావడం పెనుప్రభావం చూపింది. ప్రస్తుతం మళ్లీ వర్షాలు పడుతుండడంతో రైతాంగంలో కొత్త ఆశలు చిగురించాయి.

మిర్చి సాగుకు రైతుల ఉత్సాహం

జిల్లాలో ఖరీఫ్ సాగు సాధారణ విస్తీర్ణం 2,76,957 హెక్టార్లు కాగా సెప్టెంబర్ 15 నాటికి 79,786 హెక్టార్లలో రైతులు సాగు చేపట్టారు. సెప్టెంబర్ మాసంలో మాత్రం సాధారణ వర్షపాతం కన్నా 37 శాతం అధికంగా నమోదు కావడం కొంత కలిసివచ్చింది. మిర్చి, పత్తి, కంది పంటల సాగు ఊపందుకుంది. ముఖ్యంగా మిర్చి సాగు గత పదిహేను రోజుల్లో కొత్తగా సుమారు 15 వేల హెక్టార్లలో సాగులోకి వచ్చిందని ఉద్యానశాఖ అధికారులు చెబుతున్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో మిర్చి సాధారణ సాగు 59,797 హెక్టార్లు కాగా ప్రస్తుతం 55,745 హెక్టార్లు సాగులోకి వచ్చింది. మార్కెట్‌లో మిర్చి ధర ఆశాజనకంగా ఉండటంతో రైతులు ఎక్కువగా ఆ సాగుపైనే దృష్టిపెడుతున్నారు. గతేడాది దిగుబడి బాగా రావడం, సరాసరి ధర రూ.20 వేల వరకు ఉండటంతో మిర్చి సాగుచేసిన రైతులకు లాభాలు బాగా వచ్చాయి. ఫలితంగా ఈ ఏడాది పత్తికి బదులు మిర్చి సాగుకు రైతులు ముందుకు వస్తున్నారు. ఈ ఏడాది 77,644 హెక్టార్ల వరకు మిర్చి సాగయ్యే అవకాశం ఉందని ఉద్యానశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.



మాచర్ల మండలం కొప్పనూరులో కొత్తగా నాట్లు వేసిన మిర్చి పొలం

1.50 లక్షలకు చేరిన ఖరీఫ్ సాగు

ప్రస్తుతం ఖరీఫ్ సాగు 1,50,010 హెక్టార్లకు చేరింది. ఇది సాధారణ విస్తీర్ణంలో 54 శాతం. గతేడాది ఖరీఫ్‌లో ఇదే సమయానికి 70 శాతం (2,00,162 హెక్టార్లలో) పంటలు సాగుచేశారు. పత్తి పంట సాధారణ సాగు 1,21,621 హెక్టార్లు కాగా ఇప్పటి వరకు 63,277 హెక్టార్లలో సాగైంది. పత్తి విస్తీర్ణం ఈ ఏడాది బాగా తగ్గే అవకాశం ఉందని వ్యవసాయశాఖ అధికారులు భావిస్తున్నారు. మరో వైపు సాగర్‌లో నీటి లభ్యత చాలా తక్కువగా ఉండటంతో రైతన్నలు ముందస్తు రబీలో భాగంగా ప్రత్యామ్నాయ పంటలవైపు మళ్లుతున్నారు. వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు కర్షకులను ఆ దిశగా సమాయత్తం చేస్తున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలను ఉపయోగించుకొని విత్తనాలు విత్తుకున్నట్లయితే రైతులకు తక్కువ పెట్టుబడితో ఎంతో కొంత ఆదాయం లభించే అవకాశం ఉంటుంది. ప్రత్యామ్నాయ పంటల్లో భాగంగా తక్కువ నీటి వసతితో సాగయ్యే కంది పంటవైపు కూడా రైతులు అధికంగా మక్కువ చూపుతున్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 14,626 హెక్టార్లలో కంది సాగైంది.



రెంటచింతల నర్సరీలో మిర్చి నారు పరిశీలిస్తున్న జిల్లా ఉద్యానవనశాఖ అధికారి బెన్నీ

పల్నాడు జిల్లాలో ఇలా (హెక్టార్లలో)..	
ఖరీఫ్ సాధారణ సాగు విస్తీర్ణం	: 2,76,957
ప్రస్తుతం సాగైంది	: 1,50,010

15 వేల హెక్టార్లకుపైగా పెరిగిన మిర్చి సాగు



పదిహేను రోజులుగా కురుస్తున్న వర్షాలతో మిర్చి సాగు 15 వేల హెక్టార్లకు పైగా పెరిగింది. ఇంకా సమయం అనకూలంగానే ఉండడంతో సాధారణం కంటే ఎక్కువగా మిర్చి సాగయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. రైతులకు అవసరమైన నారు లభిస్తోంది. నర్సరీలలో నారు నాణ్యతపై నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నాం.

– బీజే బెన్నీ, జిల్లా ఉద్యానవనశాఖ అధికారి

వర్షాలతో మేలు



ఆగస్టు నెలలో తక్కువగా వానలు పడటంతో రైతులు సాగులో వెనకబడ్డారు. రెండు వారాలుగా పడుతున్న వర్షాలు రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయి. సాగు విస్తీర్ణం బాగా పెరుగుతోంది. ముఖ్యంగా మిర్చి, పత్తి, కంది పంటలకు ఈ వానల వల్ల మేలు జరుగుతుంది.

– వెంకటరామిరెడ్డి, రెడ్డిపాలెం, రొంపిచర్ల మండలం



ఆశల జల్లులు ఇలా కురిసే.. ఆనందం విరిసే

జగనన్న సురక్ష అందరికి రక్ష

ప్రభుత్వ విప్ పీఆర్కే



జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ పీఆర్కే

మాచర్ల: ఏ ఒక్కరూ వైద్యం అందక ఇబ్బంది పడకూడదనే లక్ష్యంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపట్టి పేదలకు ఆరోగ్య రక్షణ కల్పిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మాచర్ల పట్టణంలో గౌడకాలనీలోని ఆరోగ్య కేంద్రం వద్ద గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ప్రారంభించారు. డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయాలతో సీఎం జగన్ ముందుకు వెళుతున్నారన్నారు. నాడు –నేడు పథకంతో ప్రభుత్వ ఆస్పత్రులను అభివృద్ధి చేసి కార్పొరేట్ వైద్య సేవలు పేదలకు అందిస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. రోజూ జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో ఉచిత వైద్య పరీక్షలు, ఉచితంగా మందులు పంపిణీ చేస్తూ ప్రతి ఒక్కరికీ చికిత్స అందిస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరూ ఈ శిబిరాన్ని వినియోగించుకోవాలన్నారు. ప్రభుత్వం ఎక్కడా రాజీపడకుండా రూ.కోట్లు కేటాయించి విద్య, వైద్యానికి ప్రాధాన్యత ఇస్తుందన్న విషయాన్ని గమనించాలన్నారు. సీఎం జగన్ పేదల పక్షపాతి అన్నారు. వెయ్యి మందికి పైగా ఆరోగ్య శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకుని, ఉచితంగా మందులు అందుకున్నారు. మున్సిపల్ కమిషనర్ రమణబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో ప్రభుత్వ వైద్యులు డాక్టర్ కీర్తి చారి, డాక్టర్ లక్ష్మీప్రసన్న, డాక్టర్ లావణ్య, అరుణ, డాక్టర్ బాలునాయక్‌లు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. పీఆర్కే వెంట మాచర్ల చిన్న ఏసోబు, మాజీ మున్సిపల్ చైర్మన్‌లు బోయ రఘురామిరెడ్డి, తురక కిషోర్, అబ్దుల్ జలీల్, బత్తుల ఏడుకొండలు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

నగరవనం.. సుమనోహారం



స్వాగతం.. సుస్వాగతం : టెంపుల్ హిల్ ఏకో పార్కు ముఖద్వారం



'ట్రాక్'రికార్డు : ట్రెక్కింగ్ ట్రాక్‌పై నడుస్తున్న ఎమ్మెల్యే ఆర్కే, ఎంపీ అయోధ్యరామిరెడ్డి

మంగళగిరి: ప్రకృతి పరువాలు పరుచుకున్నట్టు.. రెండు కొండల మధ్య కొలువైన సుమనోహర ప్రాంతం.. పచ్చలహారాలు ధగధగలాడుతున్నట్టు అపురూప వృక్ష సంపదకు ఆలవాలమైన సుందర వనం.. సుస్వరాలేవో చెవులను సుతారంగా తాకుతున్నట్టు.. చల్లని పవనాలతో జతకట్టి.. కిలకిలారావాలు చేసే పక్షిజాతుల సమాహారం.. అడుగడుగునా ఆహ్లాదం పంచే వాతావరణం.. అబ్బురపరిచే అందాల రమణీయం.. సందర్శకులను సంభ్రమాశ్చర్యాలలో ముంచెత్తుతాయి. పిల్లలకు, పెద్దలకు ఆనందానుభూతులు పంచుతాయి. మంగళగిరిలో ఎయిమ్స్ ఆస్పత్రి పక్కన ఏర్పాటు చేసిన నగరవనం(టెంపుల్ హిల్ ఎకో పార్కు) పర్యాటకులను అమితంగా ఆకర్షిస్తోంది. దక్షిణ భారతదేశంలో ప్రసిద్ధి చెందిన శ్రీపానకాల లక్ష్మీనృసింహస్వామి కొండను ఆనుకుని నెలవైన ఈ నగరవనానికి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) ఆధ్వర్యంలో అటవీ, పర్యాటక శాఖ అధికారులు సంయుక్తంగా సరికొత్త నగిషీలు చెక్కారు. అధునాతన సొబగులద్దారు. ఈ పార్కును ఇటీవలే రాష్ట్ర అటవీశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యే ఆర్కే అట్టహాసంగా ప్రారంభించారు.



కిలకిలలు.. కళకళలు: నగరవనంలో సేదదీరుతున్న సందర్శకులు

ప్రత్యేకతలివే..

అరకును తలపించేలా ఐదు కిలోమీటర్ల మేర పర్వతారోహణ మార్గాన్ని తీర్చిదిద్దారు.

- కొండ దిగువన పచ్చటి చెట్ల మధ్య 50 ఎకరాల విస్తీర్ణంలో నగరవనం తీర్చిదిద్దారు. రూ.60 లక్షలు వెచ్చించి వసతులు కల్పించారు. అన్ని హంగులద్దారు.
- కొండపై రెండు కిలోమీటర్ల మేర ట్రెక్కింగ్ ట్రాక్ నిర్మాణం చేశారు.
- వ్యాయామశాల, చిన్నారులకు ఆటవస్తువులు ఏర్పాటు చేశారు.
- నక్షత్ర, నవగ్రహ, రాశి, పంచవటిల పేర్లతో ఔషధ మొక్కలతో కూడిన సుమనోహర రాశి వనాలను ఏర్పాటు చేశారు.

మరింత అభివృద్ధి చేస్తాం

మంగళగిరిలో ఏర్పాటు చేసిన నగరవనం సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. కొన్ని సంస్థలు ఇక్కడ గెట్ టు గెదర్ కూడా ఏర్పాటు చేసుకుంటున్నాయి. రానున్న రోజుల్లో ఈ పార్కును మరింత సుందరంగా తీర్చిదిద్దుతాం.

– ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) ఎమ్మెల్యే, మంగళగిరి

జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం



రోగులకు మందులు పంపిణీ చేస్తున్న మంత్రి విడదల రజిని

- పల్నాడు జిల్లాలో ఇప్పటి వరకు 20 వేల ఓపీ సేవలు
- రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని

చిలకలూరిపేట: జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరమని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. చిలకలూరిపేట మండలం మురికిపూడి గ్రామంలోని డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ వద్ద గురువారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని మంత్రి రజిని పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం వైద్య రంగానికి ఎంతో ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. వైద్య కళాశాలల నిర్మాణం, నాడు–నేడు పథకం ద్వారా ప్రభుత్వాస్పత్రుల ఆధునికీకరణ చేపడుతోందని వెల్లడించారు. ఫ్యామిలీ డాక్టర్ వంటి వినూత్న కార్యక్రమాలు చేపట్టిందన్నారు. ఇప్పుడు జగనన్న ఆరోగ్య సురక్ష అనే కార్యక్రమం ద్వారా అందరికీ ఉచిత వైద్య సేవలు అందుబాటులోకి తెచ్చిందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా పల్నాడు జిల్లాలో 385 వైద్య శిబిరాలు నిర్వహించబోతున్నామని చెప్పారు. ఇందులో భాగంగా ఇప్పటి వరకూ జిల్లాలో 72 వైద్య శిబిరాలు నిర్వహించామన్నారు. జిల్లాలో 20వేల ఓపీ సేవలు ఇప్పటి వరకూ నమోదు కాగా.. నాణ్యమైన వైద్యం కోసం 510 మందిని పెద్దాస్పత్రులకు సిఫారసు చేశామని తెలిపారు. 139 మంది స్పెషలిస్టు వైద్యులు సురక్ష వైద్య శిబిరాల్లో పాల్గొంటున్నారని వెల్లడించారు. చిలకలూరిపేట నియోజకవర్గంలో 39 వైద్య శిబిరాల నిర్వహణకు చర్యలు తీసుకున్నామని, ఇప్పటివరకూ 8 వైద్య శిబిరాలు నిర్వహించినట్లు చెప్పారు. నియోజకవర్గ పరిధిలో 1,637 ఓపీ సేవలు నమోదు కాగా వీరిలో 56 మందిని మెరుగైన వైద్యం కోసం పెద్దాస్పత్రులకు సిఫారసు చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దేవినేని శంకరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కోడె సుధారాణి, సొసైటీ అధ్యక్షుడు ఆరుమళ్ల వెంకటశివ, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ రవికుమార్, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రంగారావు తదితరులు పాల్గొన్నారు.

గణేశ్ నిమజ్జనంలో అడిషనల్ అడ్వకేట్ జనరల్

తాడేపల్లి రూరల్ : ఉండవల్లిలో గురువారం రాత్రి గణేశుని నిమజ్జనోత్సవం వైభవంగా జరిగింది. ఈసందర్భంగా 108 కేజీల లడ్డూ వేలంపాట నిర్వహించారు. కుంచనపల్లికి చెందిన మాజీ ఎంపీటీసీ ఆరుమళ్ల చంద్రశేఖరరెడ్డి రూ.9 లక్షలకు లడ్డూ దక్కించుకున్నారు. ఆయనను ఉత్సవ కమిటీ సభ్యులు సన్మానించారు. గణేశుని నిమజ్జనం సందర్భంగా ప్రభుత్వ అడిషనల్ అడ్వకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నిమజ్జన వాహనాన్ని ఆయనే స్వయంగా ముందుకు నడిపారు. తర్వాత విగ్రహదాత తమ్మా సుబ్బారెడ్డి, గంటు బాలాజీరెడ్డి, కళ్లం సాంబిరెడ్డి, గణేష్ యూత్ సభ్యులు పొన్నవోలు సుధాకర్‌రెడ్డిని సన్మానించారు.



పొన్నవోలు సుధాకరరెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

వేంకటేశ్వరస్వామి దేవాలయంలో చోరీ

11 కిలోల వెండి ఆభరణాలు మాయం

జే.పంగులూరు: వేంకటేశ్వర ఆలయంలో దొంగలు పడి స్వామివారి వెండి ఆభరణాలు అపహరించుకుపోయారు. ఈ ఘటన మండల పరిధిలోని తూర్పుకొప్పెరపాడు గ్రామంలో గురువారం రాత్రి జరిగింది. అందిన వివరాల మేరకు.. వేంకటేశ్వర స్వామి దేవాలయంలో గురువారం ఉదయం పూజారులు ఆలయం వద్దకు వచ్చి తలుపులు తీయబోగా, అప్పటికే తలుపులు పగులగొట్టి ఆలయంలో స్వామికి అలకరించిన వెండి ఆభరణాలు పోవడాన్ని గమనించి స్థానికులకు తెలియజేశారు. వచ్చి చూసిన స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్సై తిరుపతిరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆభరణాలు అన్ని 11 కిలోల వరకు ఉంటాయని వీటి విలువ సుమారు రూ. 7 లక్షలు వరకు ఉంటుదని ఆలయ ప్రతినిధులు తెలిపారు. 2018లో 50 కిలోల కంచుగంట చోరీకి గురైందని వెల్లడించారు.


పట్టణాల్లో గోడలను సుందరంగా తీర్చిదిద్దండి

కలెక్టర్ శివశంకర్



నరసరావుపేట: జిల్లాలోని పురపాలక సంఘాల్లో ప్రహరీలను రంగులతో సుందరంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ శివశంకర్ లోతేటి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లు, జిల్లా డెవలప్‌మెంట్ అధికారులతో కలెక్టర్ మాట్లాడారు. అన్ని మున్సిపల్ కార్యాలయాల పరిధిలో రహదారుల వెంట గోడలకు రెండు వైపులా చిత్రాలు, బొమ్మలు ముద్రించాలని సూచించారు. ప్రధాన రహదారులు, అంతర్గత రహదారులను గుర్తించి చిత్రకారులకు పోటీలు నిర్వహించాలని చెప్పారు. మహనీయుల చిత్రాలు, పూలు, బొమ్మలతో అందంగా తయారు చేయాలని వివరించారు. అవసరమైతే దాతల సహకారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ, పొడా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

వివాహితపై హత్యాయత్నం



జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న మధుకుమారి

గుంటూరు ఈస్ట్ : వివాహితపై పట్టపగలు హత్యాయత్నం జరిగిన ఘటన గుంటూరు నగరంలో కలకలం రేపింది. బాధితురాలు రాజా మధుకుమారి కథనం ప్రకారం.. మధుకుమారికి శ్రావణకీర్తి అనే వ్యక్తితో 13 ఏళ్ల క్రితం వివాహమైంది. శ్రావణకీర్తి కర్నూలులో ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్నాడు. భార్యాభర్తల మధ్య గొడవలు వచ్చాయి. మధుకుమారి తన కుమారుడితో కలిసి ఎస్.వీ.ఎస్.కాలనీలో నివాసం ఉంటున్నారు. గురువారం మధుకుమారి తన కుమారుడిని ద్విచక్ర వాహనంపై పాఠశాల వద్ద దించి తిరిగి వస్తున్న క్రమంలో ఎల్ఐసీ కాలనీ వద్ద ద్విచక్ర వాహనంపై ముగ్గురు వెనుకగా వచ్చి ఢీకొట్టారు. దీంతో మధుకుమారి కింద పడ్డారు. ముగ్గురిలో ఓ వ్యక్తి చాకుతో మధుకుమారిపై దాడి చేశాడు. విచక్షణ రహితంగా పది చోట్ల పొడిచాడు. అనంతరం ముగ్గురూ అక్కడి నుంచి పరారయ్యారు. స్థానికులు మధుకుమారిని జీజీహెచ్‌కు తరలించారు. వైద్యులు చికిత్స చేస్తున్నారు. ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు చెప్పారు. ఈ సందర్భంగా మధుకుమారి మాట్లాడుతూ తనకు భర్తతో విభేదాలు ఉన్నాయని, వారం క్రితం ఇమాం బాషా అనే వ్యక్తి వచ్చి రాజీ కుదురుస్తానని చెప్పాడని, దీనికి నిరాకరించడంతో తనపై హత్యాయత్నం జరిగిందని వివరించారు. దాడి చేసిన వారిని తాను గుర్తించలేకపోయానని వెల్లడించారు. పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

టీడీపీ కార్యకర్తపై దాడిలో నిజం లేదు: ఎమ్మెల్యే బొల్లా

వినుకొండ(నూజెండ్ల): జైలులో ఉన్న చంద్రబాబుకు సంఘీభావంగా నంద్యాల నుంచి రాజమండ్రికి పాదయాత్ర చేస్తున్న చింతల నారాయణపై వైఎస్సార్ సీపీ కార్యకర్తలు దాడి చేశారని పచ్చ మీడియాలో వచ్చిన వార్తలను, మాజీ ఎమ్మెల్యే జి.వి ఆంజనేయులు చేసిన వ్యాఖ్యలను ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఖండించారు. టీడీపీ కార్యకర్తపై దాడి చేయాల్సిన అవసరం తమ పార్టీ కార్యకర్తలకు లేదని తెలిపారు. పాదయాత్ర చేస్తున్న నారాయణపై ఎక్కడా దాడి జరగలేదని, వినుకొండలో మాత్రం ఎలా జరుగుతుందని ప్రశ్నించారు. మాజీ ఎమ్మెల్యే జీవీ నివాసంలో రాత్రి బస చేసి ఆయన పాదయాత్రకు బయలుదేరాడని చెప్పారు. సొంత పార్టీ వాళ్లే దాడి చేసి ఆ నిందను తమ పార్టీ వారిపై రుద్దుతున్నారని, అలాంటి చిల్లర రాజకీయాలు చేయాల్సిన అవసరం ఎవరికీ లేదని ఎమ్మెల్యే బొల్లా తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మార్టూరు: పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని ఇసుక దర్శి గ్రామంలో గురువారం రాత్రి వెలుగు చూసింది. ఎస్సై కే కమలాకర్ వివరాల మేరకు.. గ్రామంలోని ముస్లిం కాలనీకి చెందిన జాన్‌వలి మద్యానికి బానిసై అప్పులు చేశాడు. అప్పుల విషయం ఇంట్లో తెలుస్తుందని మనస్తాపంతో బుధవారం ఉదయం వలపర్ల గ్రామ పరిధిలోని పొలాల్లో పురుగుమందు తాగి ఆత్మహత్యయత్నం చేశాడు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న బంధువులు మార్టూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మెరుగైన చికిత్స కోసం వైద్యులు గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.

అవినీతి రహిత పాలనకు జగనే కావాలి


మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు

- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- 'ఏపీకి జగనే ఎందుకు కావాలి' శిక్షణ కార్యక్రమం

సత్తెనపల్లి:రాష్ట్రంలో అవినీతి రహిత పారదర్శక పాలనకు ఆంధ్రప్రదేశ్‌కి జగనే కావాలని ధైర్యంగా చెప్పగలిగే స్థాయిలో మనం ఉండాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో సత్తెనపల్లి మండల నాయకులతో గురువారం జరిగిన 'వై ఏపీ నీడ్స్ జగన్' (ఏపీకి జగన్ ఎందుకు కావాలి) శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. శిక్షణ కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ సత్తెనపల్లి మండల అధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమరావు అధ్యక్షత వహించారు. మంత్రి అంబటి మాట్లాడుతూ మరికొద్ది నెలల్లో ఎన్నికలు జరగబోతుండగా వైఎస్సార్ సీపీ క్షేత్రస్థాయిలో పరిపూర్ణంగా బలోపేతం చేసుకొని, ప్రభుత్వం నాలుగేళ్లుగా అందించిన సంక్షేమాన్ని ప్రజలకు వివరిస్తూ.. రానున్న ఆరు నెలలు చాలా కీలకమన్నారు. సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు ఈనెల ద్వితీయార్థంలో వినూత్న కార్యక్రమం ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టనున్నారని వివరించారు. మండల స్థాయి నాయకులంతా ఒక గ్రామంలో బస చేయటం, రెండో రోజు ఉదయమే పార్టీ జెండాలను ఆవిష్కరించుకోవడం, అనంతరం ఇంటింటికి తిరిగి సంక్షేమ అభివృద్ధిని వివరించడం, లోపాలను సవరించుకోవడం కోసం ప్రణాళిక సిద్ధమవుతుందన్నారు. అందుకోసమే తరగతులు నిర్వహిస్తున్నామని వివరించారు. మాజీ ఎమ్మెల్యే యర్రం వెంకటేశ్వరరెడ్డి, నియోజకవర్గ నాయకుడు పక్కాల సూరిబాబు, పల్నాడు జిల్లా మహిళా అధ్యక్షురాలు డాక్టర్ గీత హాసంతి, రాష్ట్ర రైతు సలహా మండలి సభ్యుడు కళ్లం విజయభాస్కరరెడ్డి, డాక్టర్ మక్కెన అచ్చయ్య, ఈసా, కట్టా సాంబయ్య, జేసీఎస్ మండల ఇన్‌చార్జి బొంతు వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళా వలంటీర్ పట్ల అసభ్య ప్రవర్తన

ప్రశ్నించిన వలంటీర్ కుటుంబంపై కత్తితో దాడి

దాచేపల్లి: మహిళా వలంటీర్ పట్ల ఓ వ్యక్తి అసభ్యకరంగా ప్రవర్తించాడు. ప్రశ్నించిన ఆమె కుటుంబ సభ్యులపై ఆ వ్యక్తి కత్తితో దాడి చేసిన సంఘటన దాచేపల్లిలోని లైబ్రరీ సెంటర్ సమీపంలో గురువారం రాత్రి జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... గోసు దుర్గా వలంటీర్‌గా విధులు నిర్వహిస్తోంది. ఈమె ఇంటి ఎదురుగా షేక్ జానీబాషా నివసిస్తున్నాడు. పలుమార్లు వలంటీర్ పట్ల జానీబాషా అసభ్యకరంగా ప్రవర్తిస్తూ వేధింపులకు గురి చేస్తున్నాడు. ఈ విషయాన్ని వలంటీర్ దుర్గా కుటుంబ సభ్యులకు చెప్పింది. ప్రశ్నించేందుకు వెళ్లిన వలంటీర్ తల్లి ఈశ్వరమ్మతోపాటుగా మరో ముగ్గురిపై జానీబాషా కత్తితో దాడికి పాల్పడ్డాడు. గాయాలు కావటంతో రక్తస్రావమైంది. బాధితులు పోలీసులకు సమాచారం ఇవ్వటంతో హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు దాడికి పాల్పడిన జానీబాషాను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరిలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ దాసరి శివనాగరాజు చెప్పారు.

ప్రజలంతా జగనన్ననే కోరుకుంటున్నారు

- టీడీపీ పాలనలో ప్రజలకు చేసిందేమీలేదు
- నాలుగున్నరేళ్లలో జగనన్న జనం కష్టాలను తీర్చారు
- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని


మాట్లాడుతున్న మంత్రి విడదల రజిని

చిలకలూరిపేట: రాష్ట్రంలోని ప్రజలందరికీ తమకు ఎవరు మేలు చేశారో, ఎవరు నష్టపరిచారో తెలుసునని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే ... కార్యక్రమ నిర్వహణకు సంబంధించి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులకు చిలకలూరిపేటలోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆర్యవైశ్య కల్యాణమండపంలో గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మంత్రి విడదల రజిని హాజరయ్యారు. ముందుగా దివంగత నేత డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మంత్రి రజిని మాట్లాడుతూ జగనన్న పరిపాలనలో రాష్ట్ర ప్రజలంతా సంతోషంగా ఉన్నారని తెలిపారు. చంద్రబాబునాయుడు 2014 ఎన్నికల్లో ఎలాంటి బూటకపు హామీలు ఇచ్చి ప్రజలను మభ్యపెట్టి గెలిచారో... మళ్లీ ఇప్పుడు అలాంటి బూటకపు హామీలతో ముందుకు వస్తున్నారని చెప్పారు. జగనన్న ముఖ్యమంత్రిగా రాష్ట్రాన్ని నిజమైన అభివృద్ధి దిశగా తీసుకెళ్లారని చెప్పారు. నేరుగా బ్యాంకు ఖాతాల్లోకి నగదు జమచేయడం ద్వారా సంక్షేమ పథకాలను 100 శాతం విజయవంతంగా అమలు చేశామని చెప్పారు. ఈ విషయాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లాలని కోరారు. అందుకే పార్టీ నాయకులంతా ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే ... కార్యక్రమాన్ని విజయవంతంగా ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. టీడీపీ హయాంలో మాటలే తప్ప అభివృద్ధి ఊసే లేదని, ప్రజలను కష్టాలకు వదిలేశారని విమర్శించారు. ఈ విషయాలన్నీ పార్టీ నాయకులు ప్రజల వద్దకు వెళ్లి గుర్తు చేయాలని చెప్పారు. నాలుగున్నరేళ్లలో జగనన్న చేసిన మంచి పనులను కూడా వివరించాలని చెప్పారు.

ఒకవైపు గడపగడప... మరోవైపు జగనన్న ఆరోగ్య సురక్ష ...

మంత్రి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే ... కార్యక్రమంతో పాటు మరో వైపు తాము గడపగడకు కార్యక్రమాన్ని కూడా కొనసాగిస్తూనే ఉంటామని చెప్పారు. ఇప్పటికే చిలకలూరిపేట నియోజకవర్గంలో గడపగడకు కార్యక్రమం 90శాతం పూర్తయిందని, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎంతో ఉత్సాహంగా ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకువెళుతున్నారని తెలిపారు. అంతకు రెట్టింపు ఉత్సాహంతో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే ... కార్యక్రమాన్ని కూడా విజయవంతం చేయాలని కోరారు. మరోవైపు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల ద్వారా ప్రజలందరికీ మెరుగైన వైద్యం అందించే కార్యక్రమం కూడా కొనసాగుతోందన్నారు. ఇప్పటికే అన్ని గ్రామాల్లో విజయవంతంగా శిబిరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గతంలో ఏ ప్రభుత్వం ఇంతగా ప్రజల్లోకి వచ్చి ఇన్ని కార్యక్రమాలు చేపట్టలేదని, జగనన్న గొప్ప ఆలోచనల వల్ల మాత్రమే తమ పార్టీకి, తమ ప్రభుత్వానికి ఇది సాధ్యమైందని స్పష్టం చేశారు. ముందుగా డిజిటల్ స్క్రీన్‌పై ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలసి వీక్షించారు. మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్లు వలేటి వెంకటేశ్వరరావు, కొలిశెట్టి శ్రీనివాసరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, ఎంపీపీలు దేవినేని శంకరరావు, పిడతల ఝాన్సీ, తలతోటి రాణి, జెడ్పీటీసీ సభ్యులు కోడె సుధారాణి, కాట్రగడ్డ మస్తాన్‌రావు, ముక్తా వాసు, పార్టీ పట్టణ అధ్యక్షులు పఠాన్ తలహాఖాన్, విడదల కమలేంద్ర, చిలకలూరిపేట, యడ్లపాడు, నాదెండ్ల మండలాల పార్టీ అధ్యక్షులు గుత్తా యాములయ్య, ఘంటా శంకర్, మద్దూరి కోటిరెడ్డి, సొసైటీల అధ్యక్షులు కొండవీటి ఆంజనేయులు, ఆరుమళ్ల వెంకటశివ, బశల శివరామకృష్ణ, ఓరుగంటి పూర్ణయ్య, కురుగుంట్ల వెంకటరెడ్డి, మంగు ఏడుకొండలు, రాష్ట్ర ముస్లిం కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ దరియావలి, వైఎస్సార్ సీపీ నాయకులు తోట బ్రహ్మస్వాములు, రాచమంటి చింతారావు, మద్దిరాల విశ్వనాథం, బత్తినేని శ్రీనివాసరావు, వడితే కోట్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

8న హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక

తెనాలి: జిల్లా సీనియర్ మహిళలు, జూనియర్ బాలుర హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక ఈనెల 8వ తేదీన తెనాలిలో నిర్వహించనున్నారు. స్థానిక చెంచుపేటలోని అన్నాబత్తుని సత్యనారాయణ స్టేడియంలో మధ్యాహ్నం 3 గంటలకు ఎంపికలు జరుగుతాయని హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి బి.వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలియజేశారు.

టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరిక


వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ప్రభుత్వ విప్ పీఆర్కే

వెల్దుర్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న అభివృద్ధి, పథకాలకు ఆకర్షితులై టీడీపీకి చెందిన పలువు ఆ పార్టీని వీడి వైఎస్సార్ సీపీలో చేరినట్లు ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని గొట్టిపాళ్లకు చెందిన ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన 40 కుటుంబాల వారు టీడీపీని వీడి మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ పల్లపాటి గురుబ్రహ్మం ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారికి పీఆర్కే కండువాలు కప్పి ఆహ్వానించారు. పీఆర్కే మాట్లాడుతూ సీఎం జగన్ చేస్తున్న, అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఆకర్షితులై టీడీపీని వీడుతున్నారన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేసి వారి కుటుంబాల అభివృద్ధికి పాటుపడ్డారన్నారు. నవరత్నాల ద్వారా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తూ వారి కుటుంబాలలో సంతోషాలు నింపారన్నారు. జగన్ చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై టీడీపీని వీడిన వారిలో పరిశ వెంకయ్య, ముప్పారపు మరియదాసు, గాలి మరియబాబు, కందుల బాబు, ముప్పారపు మరియదాసు, ముప్పరపు సురేష్, కందుల గాబ్రియేలు, కోళ్ళ చిన్న అబ్బాయి, పులిమెల పేతురు, కందుల మరియబాబు, పులిమెల మరియదాసు, ముప్పరపు కృపారావు, కొల్ల ప్రకాష్, కందుల దేవసహాయం, పులిమెల బాలకోటి, కొల్ల మరియదాసు, గాదె పెద మార్కొండయ్య, పేరువాల ఇస్సాకు, కొల్ల యోహాను, గాలి కోటయ్య, గాలి ప్రేమ్‌కుమార్, కొల్ల కోటేశ్వరరావు, పరిశ ప్రసాద్, కిన్నెర పుల్లయ్య, కందుల సామేలు, కొల్ల చిన రామయ్య, జ్యోతిబాబు, ముప్పరపు దావీదు, పరిస ఏసోబు, కందుల భిక్షాలు, కేతావత్ రవినాయక్, కేతావత్ హనుమానాయక్‌తోపాటు మరో 8 కుటుంబాల వారుఉన్నారు. వారు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి ఎంతో సేవ చేశామని, అయినప్పటికీ సరైన గుర్తింపు లేకపోవటంతో సీఎం జగన్ చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలను చూసి వైఎస్సార్‌సీపీలో చేరామన్నారు. ఇప్పటి నుంచి పార్టీ అభివృద్ధికి కష్టపడి పని చేస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ పార్టీలో చేరిన వారికి అన్ని విధాలా సహకరిస్తామని ఎమ్మెల్యే చెప్పారు. వైఎస్ జగన్‌కు అందరం మద్దతుగా నిలిచి ఆయనను ముఖ్యమంత్రి చేసేంత వరకు సైనికుల్లా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చింతా శివరామయ్య, జెడ్పీటీసీ సభ్యులు కేతావత్ రూప్లీ బాలునాయక్, జెడ్పీటీసీ మాజీ సభ్యులు బొమ్మిరెడ్డి సుబ్బారెడ్డి, ఎంపీటీసీ పోలకం వెంకటనారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు మేడబోయిన ఇన్నయ్య, మోరబోయిన అచ్చయ్య, చింతా ఆదినారాయణ, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రత్యేక కౌంటర్ల ద్వారా కందిపప్పు విక్రయం

- నిత్యావసరాల ధరలు నియంత్రించేందుకు ప్రభుత్వం చర్యలు
- ఆ పత్రిక కథనంలో వాస్తవం లేదు

నరసరావుపేట: జిల్లాలో ప్రత్యేక కౌంటర్ల ద్వారా కందిపప్పు విక్రయాలు చేస్తూ నిత్యావసర ధరలు నియంత్రించేందుకు ప్రభుత్వం ఇప్పటికే చర్యలు తీసుకుందని పౌరసరఫరాలశాఖ జిల్లా అధికారి ఎస్. పద్మశ్రీ పేర్కొన్నారు. గురువారం ఒక దినపత్రిక(సాక్షికాదు)లో అస్తవ్యస్తంగా రేషన్ సరఫరా అంటూ ప్రచురితమైన కథనాన్ని ఆమె ఖండించారు. ఇందులో ఏమాత్రం వాస్తవం లేదన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా జాయింట్ కలెక్టర్ గత జూలై నెల నుంచి దేశవాళీ కందిపప్పు కేజీ రూ.135, ఆఫ్రికన్ వెరైటీ కందిపప్పు రూ.120 చొప్పున ప్రత్యేక కౌంటర్ల ద్వారా తక్కువ ధరలకు ప్రజలకు అందజేయటం జరుగుతుందన్నారు. ప్రత్యేకంగా మాచర్ల, దుర్గి, కారంపూడిలలో దేశవాళీ కందిపప్పు రూ.120లకే లబ్ధిదారులకు అందజేయటం జరిగిందన్నారు. ఇప్పటివరకు 11,492మంది కార్డుదారులకు 181.13క్వింటాళ్ల కందిపప్పు తక్కువ ధరలకు అందించామన్నారు.

ఇళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

జిల్లా అడిషనల్ ఎస్పీ చంద్రశేఖరరావు


మాట్లాడుతున్న జిల్లా అడిషనల్ ఎస్పీ చంద్రశేఖరరావు

వినుకొండ(నూజెండ్ల): వినుకొండ పట్టణంలోని ప్రజలు తమ ఇళ్లకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా దొంగతనాలు అరికట్టవచ్చని పల్నాడు జిల్లా అడిషనల్ ఎస్పీ చంద్రశేఖరరావు తెలిపారు. వినుకొండ పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అడిషనల్ ఎస్పీ చంద్రశేఖరరావు మాట్లాడుతూ ఇటీవల జరిగిన ద్విచక్రవాహనాల దొంగతనానికి సంబంధించి నరసరావుపేట పట్టణానికి చెందిన పసుమర్తి సంతోష్, సిక ఉదయ్‌కుమార్‌లు చెడు వ్యసనాలకు బానిసలై ఇటువంటి దొంగతనాలకు పాల్పడుతున్నారు. నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి సుమారు రూ.16లక్షల విలువ చేసే 32 మోటారు సైకిళ్లను రికవరీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ మహేష్, సీఐ సాంబశివరావు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కృష్ణాపై ప్రకాశం జిల్లా జట్టు విజయం


ఐదు వికెట్లు సాధించిన పాశం నవీన్

నరసరావుపేట: స్థానిక ఏసీఏ ఎస్‌కేఆర్‌బీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సెంట్రల్ జోన్ అంతర్ జిల్లాల బాలుర మూడు రోజుల టెస్ట్ క్రికెట్ పోటీల్లో ప్రకాశం జిల్లా జట్టు 163 పరుగుల భారీ తేడాతో కృష్ణా జిల్లా జట్టుపై విజయం సాధించింది. మూడురోజుల నుంచి కృష్ణా, ప్రకాశం జిల్లా జట్ల మధ్య మొదటి మ్యాచ్ జరుగుతున్న విషయం విదితమే. నిన్నటి ఓవర్ నైట్ స్కోర్ తొమ్మిది వికెట్ల నష్టానికి 187పరుగులతో గురువారం బ్యాటింగ్ ప్రారంభించిన ప్రకాశం జిల్లా జట్టు 189 పరుగులకు ఆలౌట్ అయింది. అనంతరం తమ రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన కృష్ణా జిల్లా జట్టు ఆటగాళ్లు 152 పరుగులు చేసి ఆలౌట్ అయ్యారు. కృష్ణా జిల్లా జట్టులోని విశాల్ మాత్రమే పోరాడి 58 పరుగులు చేశారు. ప్రకాశం జిల్లా జట్టులోని పాశం నవీన్ ఐదు వికెట్లు సాధించగా, చిన్నారావు, దుర్గా బాలాజీలకు చెరో రెండు వికెట్లు లభించాయి. ఈనెల ఏడవ తేదీ నుంచి ప్రకాశం, గుంటూరు జిల్లా జట్ల మధ్య మ్యాచ్ జరుగుతుందని గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎన్.సీతాపతిరావు వెల్లడించారు.

ఖాతాదారుల సేవలే ఏపీజీబీ ప్రథమ లక్ష్యం

బల్లికురవలో బ్రాంచ్‌ను ప్రారంభించిన ఏపీజీబీ చైర్మన్ రాకేష్ కశ్యప్


బల్లికురవ ఏపీజీబీ భవనాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ రాకేష్ కశ్యప్

బల్లికురవ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందజేస్తున్న పలు పథకాలు, సేవలు సకాలంలో లబ్ధిదారులకు అందించటమే ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ ధ్యేయమని ఏపీజీబీ చైర్మన్ రాకేష్ కశ్యప్ తెలిపారు. గురువారం బల్లికురవలో ఆధునిక వసతులతో నూతన భవనంలోకి బ్రాంచ్ మార్పులో భాగంగా చైర్మన్ బ్రాంచ్‌ని కౌంటర్‌ను, లాకర్‌ను, ఏటీఎంను ప్రారంభించారు. కడప, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, అనంతపురం జిల్లాల్లో ఆరు దశాబ్దాలుగా ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 56 శాఖలు, 51 బిజినెస్ కరస్పాండెంట్‌ల ద్వారా వాణిజ్య బ్యాంకులతో సమానంగా సేవలందిస్తున్నట్లు చెప్పారు. పంట, బంగారు రుణాలతోపాటు చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు వాహనాల కొనుగోలుకు రుణాలు అందజేస్తున్నట్లు తెలిపారు. డిపాజిట్లపై కూడా అత్యధిక వడ్డీ చెల్లిస్తున్నామన్నారు. ఇంటి నుంచి ఇంటర్‌నెట్ ద్వారా మొబైల్ బ్యాంకింగ్ యూపీఐ సేవలు అందిస్తున్నామని తెలిపారు. ఆర్ఎం హేమలత, మేనేజర్ బీ.సుకుమార్, బ్యాంక్ సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యంపై నిరంతర పర్యవేక్షణ

- జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి
- చినతురకపాలెం వైద్య శిబిరం సందర్శన
- విద్యార్థినుల్లో రక్తహీనత నివారణకు బంగారుతల్లి కార్యక్రమం
- పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్


బంగారుతల్లి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ శివశంకర్, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేటరూరల్: పేదల ఆరోగ్యంపై నిరంతర పర్యవేక్షణ ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి తెలిపారు. మండలంలోని చినతురకపాలెంలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో కలెక్టర్ శివశంకర్, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, జాయింట్‌కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ శివశంకర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ విద్య, వైద్య రంగాలలో విప్లవాత్మకమైన మార్పులు చేపట్టిందన్నారు. విలేజ్ హెల్త్ క్లీనిక్‌ల ఏర్పాటు నుంచి పిడుగురాళ్లలో మెడికల్ కళాశాల ఏర్పాటు వరకు గణనీయమైన మార్పులు చేస్తుందని తెలిపారు. 108 సర్వీసులను విస్తృతపరచినట్లు తెలిపారు. ప్రభుత్వ నరసరావుపేటలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో 35మంది వైద్యులను నియమించామని తెలిపారు. సర్వజన ఆసుపత్రిలో నెలకు సుమారు 300 ప్రసవాలు చేయడం ద్వారా రాష్ట్రంలోనే పల్నాడు జిల్లా ముందు వరుసలో ఉందని తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో జగనన్న సురక్ష కార్యక్రమానికి మంచి స్పందన వస్తుందని, దీనికి అనుగుణంగా మెడికల్ క్యాంప్‌లు పెంచేవిధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు జిల్లాలో 72 మెడికల్ క్యాంప్‌లు నిర్వహించినట్లు వివరించారు. మెడికల్ క్యాంప్‌లో పరీక్షలు, వైద్యం అనంతరం నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని తెలిపారు.

రక్తహీనత నివారణకు బంగారుతల్లి

కిషోర బాలికలలో రక్తహీనత తగ్గించడంలో భాగంగా జిల్లాలో ఎక్కడా లేని విధంగా స్కూల్ విద్యార్థినులకు బంగారుతల్లి కార్డులను అందజేస్తున్నట్లు తెలిపారు. బంగారుతల్లి కార్యక్రమాన్ని ప్రారంభించి కార్డులను పాఠశాల ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. ఎప్పటికప్పుడు రక్తపరీక్షల వివరాలు నమోదు కాబడి విద్యార్థినుల తల్లిదండ్రుల సంతకం తీసుకోవడం జరుగుతుందన్నారు. పల్నాడు జిల్లా 35శాతం రక్తహీనత ఉన్న కిషోరబాలికలు ఉన్నారని తెలిపారు. వారికి బడిలో అందించే పౌష్టికాహారంతో పాటు ఇంటి వద్ద ఐరన్ రిచ్ పదార్థాలను అందించాలని సూచించారు. ఉద్యోగం కోసమే చదువు కాదని, మానసిక, సామాజిక వికాసానికి తోడ్పడుతుందని తెలిపారు.

జగనన్న ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోవాలి

ఆదర్శ గ్రామమైన చినతురకపాలెం నుంచి 29మంది డాక్టర్లు, 300మందికిపైగా ఇంజనీర్లు ఉన్నారని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి తెలిపారు. జగనన్న సురక్ష ద్వారా 7 రకాల వైద్య పరీక్షలు నిర్వహించి వంద రకాల మందులు అందజేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా 17 నూతన వైద్య కళాశాలల నిర్మాణానికి శ్రీకారం చుట్టిందన్నారు. 8400 డాక్టర్ పోస్టులను భర్తీచేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ బి.రవి, జిల్లా విద్యాశాఖాధికారి శ్యామ్యూల్, జెడ్పీ సీఈఓ మోహన్, మండల రెవెన్యూ అధికారి రమణానాయక్, ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ స్వామి, సర్పంచ్ షేక్ పాదిలి అబ్దుల్‌రషీద్, ఎంపీటీసీ షేక్ మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

– ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి